క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


ఎం.శ్వేత


ఎం.శిరీష


ఎ.చిత్ర


బి.ఢిల్లేశ్వరి


అంజలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల విద్యార్థులు పలువురు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎ.సత్యవతి మంగళవారం తెలిపారు. ఎంపికైన వారిలో మండంగి శ్వేత, మండంగి శిరీష్, ఆరిక చిత్ర, బిడ్డక ఢిల్లేశ్వరి, తాడింగి అంజలి ఉన్నారు.

విద్యార్థుల అవగాహన ర్యాలీ


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పార్వతీపురం రూరల్: ఈగల్ బృందం నేతృత్వంలో మంగళవారం మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో మత్తు పదార్థాలను నిరోధించేందుకు విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించి పాఠశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ మేరకు ఈగల్ బృంద సభ్యులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీతానగరం: మండలంలోని సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సమస్యలను పరిష్కరించేంత వరకూ రాష్ట్రస్థాయిలో ఆందోళన చేపట్టనున్నట్లు వివిధ శాఖల సచివాలయ ఉద్యోగులు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సచివాలయ వెల్ఫేర్, మహిళాపోలీస్, ఇంజినీరింగ్ సహాయకులు, రెవెన్యూకార్యదర్శులు, పశువైద్య సహాయకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళ వారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన పాలకులు ఇంతవరకూ పట్టించుకోలేదని ఆరోపించారు.ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సర్వీస్ కమిషన్ ద్వారా పోటీ పరీక్షల్లో ఉద్యోగాలు సాధించామ న్నారు. 5 సంవత్సరాలుగా సేవలందించడంతో గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర యూనియన్ ద్వారా వినతిపత్రాలిచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ప్రసాద్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

జూలై 9న సమ్మెలో పాల్గొంటున్నాం

సాలూరు: లేబర్స్ కోడ్స్ రద్దు, అంగన్వాడీల సమస్యల పరిష్కారం తదితర ప్రధాన డిమాండ్లతో కార్మిక సంఘాల పిలుపుమేరకు వచ్చే నెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో పాల్గొంటున్నామని అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు తెలిపారు.ఈ మేరకు మంగళవారం రూరల్ ప్రాజెక్టు కార్యాలయంలో అధికారులకు సమ్మె నోటీసు అందించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ, దేశంలో నరేంద్రమోడీ అమలుచేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిలిపివేసే వరకు ఈ పోరాటాలు ఉధృతంగా కొనసాగిస్తూనే ఉంటామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా మోడీ విధానాలకు వంతపాడుతూ పనిగంటలు పెంచాలనే ఆలోచనలో ఉందని, అటువంటి నిర్ణయాలను మానుకుని,ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌరీశ్వరి దేవి, షేక్‌షబానా, ఈశ్వరరావు, శశికళ, శేఖర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజమే లక్ష్యం

సీతానగరం: మత్తు పదార్థ రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సీఐ డి.పద్మావతి అన్నారు. ఈ మేరకు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఎల్.దాలినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల ప్రజల్లో వచ్చే ఆరోగ్యపరమైన సమస్యలు, రుగ్మతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పద్మావతి మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అనర్థాలకు పాలపడుతున్నారన్నారు. సమాజాన్ని మత్తు నుంచి కాపాడే బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. ప్రజారోగ్యానికి విద్యార్థులు అవగాహన కల్పించుకుని గ్రామాల్లో ప్రజలను చైతన్య పర్చాలని కోరారు. మత్తు పదార్థాల విక్రయాలు, ప్రోత్సహించడం నేరమని ప్రజలకు తెలియ చేయాలని సూచించారు.

మండల సమావేశం గరం.. గరం..!

- ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం ఇవ్వకపోతే ఎలా?
- రైతులకు సరిపడ విత్తనాల్లేవు..
- అధికారుల నిలదీత


సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న ఏవో వాహిని

సీతంపేట:

ప్రభుత్వ కార్యక్రమాలు, క్షేత్ర స్థాయిలో పథకాల అమలు గూర్చి రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకపోతే ఎలా అని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. స్థానిక వైటీసీలో ఎంపీపీ బి.ఆదినారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం గరం గరంగా సాగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో పెద్దూరు సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీకి సరిపడ వరి విత్తనాలు రాలేదని, కనీసం విత్తనాల పంపిణీ చేస్తున్నామన్న సమాచారం కూడా మాకు ఇవ్వడం లేదని సభ్యులు ప్రశ్నించారు. సీఆర్ విత్తనాలు కేవలం పది బస్తాలు తీసుకువచ్చి అరకొర పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. చిన్నపల్లంకి సర్పంచ్ మూటక సుమలత మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో వీఏఏ విధి నిర్వహణలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులకు వ్యవసాయ పరంగా ఎటువంటి సమాచారం, సూచనలు, సలహాలు ఇవ్వడం లేదని, కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయరని, వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. దీనికి స్పందించిన వ్యవసాయాధికారి వాహిని జేడీ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్తానన్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.2.91 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, ఎక్కడెక్కడ దేనికి ఖర్చు చేశారో వెల్లడించాలని సభ్యులు పట్టుబట్టారు. గోశాలలు, ఇతర రహదారి పనులు చేసినప్పటికీ బిల్లులు చెల్లింపులు లేదని సర్పంచ్‌లు జె.సుందరమ్మ, బి.తిరుపతిరావు తదితరులు తెలిపారు. బిల్లులు అప్‌లోడ్ చేయడం జరిగిందని ఏపీవో సాగర్ సమాధానమిచ్చారు. గంజాయి విచ్చలవిడిగా కొంతమంది యువత సేవించి దొంగతనాలకు పాల్పడుతున్నారని, తల్లిదండ్రులకు చెడ్డపేరు తీసుకువస్తున్నారని కట్టడి చేయాలని వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి కోరారు. అంబలిగండి, వంబరెల్లి మరికొన్ని రహదారులు అర్ధాంతరంగా ఆగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైస్ ఎంపీపీతో పాటు సర్పంచ్‌లు వెంకునాయుడు, సుశీల తెలిపారు. ఆడలి వ్యూపాయింట్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, సరైన రహదారి, రక్షణ గోడ నిర్మించాలని లేదంటే మూసివేయాలని వైస్ ఎంపీపీ కోరారు. రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఏఈ నాగభూషణ్ సమాధానమిచ్చారు. శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేసే విధంగా చూడాలని సర్పంచ్ వెంకునాయుడు సీడీపీవో సిమ్మాలమ్మ దృష్టికి తీసుకువచ్చారు. మలేరియా జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని తీవ్రత తగ్గించడానికి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదినారాయణ సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సంధ్యారాణి, ఎంపీడీవో బిబి.మిశ్రో, ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మల్లేశ్వరరావు, పీఆర్ జేఈ కిరణ్, హౌసింగ్ ఏఈ వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యం, ఏఎస్ఐ సంజీవరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం, గొటివాడ 14వ పోలింగ్ కేంద్రాన్ని కురుపాం తహసీల్దారు కె.జయ మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ప్రజలకు అందాల్సిన పౌరసేవలు సకాలంలో అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట డీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల తర్వాతే బదిలీలు చేపట్టాలి


ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న జీఎస్‌డబ్ల్యూఈ ఉద్యోగులు

భామిని: ప్రభుత్వ తీరును నిరసిస్తూ వార్డు సచివాలయ ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మంల పరిషత్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపి నినాదాలు చేశారు. తమకు తక్షణమే పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పే స్కేలు రివిజన్ చేసి, రెండు నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని కోరారు. చాలీచాలని జీతాలు చెల్లిస్తున్నందున విధిగా లోకల్ మండలాల్లో బదిలీలు జరపాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

సచివాలయ ఉద్యోగుల వినతి

సీతంపేట: సొంత మండలాల్లో పని చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో బిబి మిశ్రోకు సచివాలయ ఉద్యోగులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఒకే శాఖకు చెందిన ఉద్యోగులకు రెండు రకాల నిబంధనలు సరికాదన్నారు. కార్యక్రమంలో రవీంద్ర, చిరంజీవి, సురేష్, రంగా తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

గిరిజన మహిళ భూ సమస్యకు పరిష్కారం చూపండి


గిరిజన సంక్షేమసంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్‌కు తన సమస్యను తెలియజేస్తున్న సాయమ్మ

పార్వతీపురం రూరల్: తన డీ పట్టా భూమిని తనకు అప్పగించి సమస్య పరిష్కరించాలని పార్వతీపురం మండలంలోని డీకెపట్నం గ్రామానికి చెందిన గిరిజన మహిళ సిమిడి సాయమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆమె గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్‌ను తన బంధువుతో కలిసి సమస్యను వివరించింది. సాయమ్మ తల్లి మారుకొండ రాములమ్మ పేరిట ఉన్న డీపట్టా భూమిని తమ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సుమారు 50సెంట్లు మరో వ్యక్తికి అక్రమంగా అమ్మేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో తమ భూమి హద్దులు సర్వేచేసి ప్రభుత్వం తనకు అప్పగించాలని కోరారు. నెలరోజుల క్రితం ఈ సమస్యకు సంబంధించి సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. అయితే సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ స్పందిస్తూ భూమి అక్రమంగా అమ్మినవారిపై పీటీటీ కేసు నమోదు చేయాలని ఆదేశించినప్పటికీ అప్పటి తహసీల్దార్ ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ఆరోపించింది. ఈ మేరకు పాలక రంజిత్ కుమార్ మాట్లాడుతూ గిరిజనులను పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాలకు తిప్పకుండా సమస్యలపై విన్నవించేందుకు ఉన్నతాధికారుల వద్దకు వచ్చినప్పుడు వీలైనంత మేరకు పరిష్కారం చూపాలి కానీ ఇలా కార్యాలయాల చుట్టూ తిరిగేలా గురిచేయకూడదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మక్కువ మండల వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం

మక్కువ: పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు నియోజకవర్గంలోని మక్కువ మండలం వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ అధ్యక్షుల, బీసీ విభాగ కమిటీలను వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, పార్టీకేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు పార్టీ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా మావుడి రంగునాయుడు, యూత్ వింగ్ అధ్యక్షుడిగా మావుడి తిరుపతినాయుడులను నియమించింది.

బీసీ విభాగ కమిటీ సభ్యులు వీరే..

బీసీ విభాగ కమిటీ ప్రెసిడెంట్‌గా వాసిరెడ్డి అప్పలనాయుడు, వైస్ ప్రెసిడెంట్లుగా తీళ్ల రామకృష్ణ, రౌతు ఆదినారాయణ, జనరల్ సెక్రటరీలుగా గేదెల వెంకట రమేష్, బెల్లాన లక్ష్మి, బొత్స సింహాచలం, సెక్రటరీలుగా చింతల కృష్ణ, చీపురు రామ్మూర్తి, పెంట విశ్వేశ్వరరావు, అల్లు వెంకటరమణ, మత్స తిరుపతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బొత్స సింహాచలం, రౌతు హరిసాయిరామకృష్ణ, కొల్లి చిన్నయ్య, ముచ్చి కృష్ణ, అల్లు కృష్ణమూర్తి, దొడ్డి శ్రీధర్, బొంగు ప్రసాద్, చింతల గోపాలకృష్ణ, అల్లు పోలమ్మ, పెంట రామకృష్ణ, చిన్ని ఈశ్వరరావు, కొట్నాన ధనుంజయరావులను నియమించారు.

ఉప ఆరోగ్య కేంద్రం తనిఖీ

సీతానగరం: గ్రామాల్లో ఉన్న ఉప ఆరోగ్య కేంద్రాల ద్వారా గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కేవీఎస్ పద్మావతి అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న లక్ష్మీపురం ఉప ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం డాక్టర్ రమ్యశ్రీతో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ఉప ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు సక్రమంగా నిర్వహించాలని, ఆబా ఐడీ క్రియేట్ చేయాలని సూచించారు. జననీ మిత్ర అప్లికేషన్స్ ఎలా జరుగుతున్నాయో పరిశీలించారు. సీజనల్ వ్యాధులు వచ్చే రోగులకు వైద్య సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో పెదంకలాం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై కంది, రాగి విత్తనాల పంపిణీ

మక్కువ: మండలంలోని కోన, దబ్బగెడ్డ గ్రామాల్లో వ్యవసాయాధికారి చింతల భారతి ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి నిర్వహించారు. కోన గ్రామంలో రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను ఈ సందర్భంగా ఆమె పరిశీలించి మొక్కజొన్న పంటకు కత్తెరపురుగు ఆశించిందని, పురుగు నివారణకు వేపనూనె, ఇమామెక్టిన్‌బెంజోయేట్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే ఆసక్తి కలిగిన గిరిజన రైతులుకు రాగి, కంది విత్తనాలను శతశాతం రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. కంది విత్తనాలు పత్తిపంటలో అంతరపంటగా సాగుచేసుకోవచ్చునని, అలాగే పొలంగట్లపై వేసుకోవచ్చని తెలిపారు. విత్తనాలు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు రామ్‌కుమార్, సాయిప్రకాశ్ పాల్గొన్నారు.

డ్రోన్‌తో యాంటీ లార్వా ఆపరేషన్


యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తున్న డ్రోన్

సీతంపేట: మండలంలోని నాయకమ్మగూడ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు జిల్లా మలేరియా నివారణాధికారి పి.వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. దీని ద్వారా మురికి కుంటల్లో ఉన్న దోమల కారక లార్వా నశించిపోతుందన్నారు. ఇప్పటికే ఐఆర్ఎస్ ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని ఇళ్లల్లో హైరిస్క్ మలేరియా గ్రామాల్లో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు, మలేరియా నివారణ కన్సల్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూ విస్తీర్ణం మేరకు రేషనలైజేషన్


తహసీల్దార్ కార్యాలయం వద్ద సహాయ సర్వేయర్ల నిరసన

భామిని: సచివాలయ సిబ్బంది రేషన్‌లైజేషన్ జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ గ్రామ భూ విస్తీర్ణం మేరకు హేతుబద్ధీకరణ చేయాలని మండల సహాయ సర్వేయర్లు ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సహాయ సర్వేయర్ల సంఘ నాయకులు ప్రశాంత్, త్రివేణి, పూర్ణల ఆధ్వర్యంలో మంగళవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎస్.శివన్నారాయణకు వినతిపత్రం అందించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పెన్‌డౌన్ చేస్తున్నట్లు ప్రకటించారు. సహాయ సర్వేయర్ల సమ్మతి మేరకు రేషన్‌లైజేషన్ ఇతర శాఖకు కేటాయించాలని కోరారు. పదోన్నతులు చేపట్టి సీనియార్టీ మేరకు బదిలీలు చేయాలని కోరారు.

పాలకొండలో వర్షం


పాలకొండ పట్టణ పరిసరాల్లో వర్షం

పాలకొండ రూరల్: రుతుపవనాల తాకిడితో వాతావరణం చల్లబడింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్ని వర్గాల ప్రజలకు ఊరటనిస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో చెరువులు, పంట పొలాల్లోకి నీరు చేరటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విత్తన కార్తి దాటక మునుపే వెదలు వేసిన రైతులకు ఈ వర్షాలు ఎంతో మేలు చేయనున్నాయని రైతులు చెబుతున్నారు.

మరోవైపు నారు పోసుకునేందుకు అన్నదాతలు తమ పొలాలను సిద్ధం చేస్తున్నారు. వర్షంలోనే బురద దుక్కులు చేపట్టారు. ప్రస్తుత వాతావరణ స్థితి అన్నదాతలకు అనుకూలమని, మరో రెండు రోజులు వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు ‘కూటమి’ దగా

గుమ్మలక్ష్మీపురం: కూటమి పాలనలో విద్యార్థులకు దగా(మోసం) జరుగుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని విలేకరులతో మంగళవారం మాట్లాడారు. అధికారంలోకి రాగానే విద్యార్థి, యువత సమస్యలు తీర్చేస్తామని గొప్పలు చెప్పారని, తీరా చూస్తే మోసం తప్ప మరేమీ లేదన్నారు. ఇంతవరకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. మొత్తం రూ.4,200 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా, వాటిని ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆ భారం మోయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికార దాహం తీర్చుకునేందుకు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి, ఇప్పుడు రాష్ట్ర ఖజానా చూస్తే భయమేస్తోందని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సీనియర్ నాయకులమని చెప్పుకునే మీకు తెలీదా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ యువతకు 20 లక్షలు ఉద్యోగాలు ఇవ్వాలని, నిరుద్యోగ భృతి, విద్యార్థుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. వారికి న్యాయం జరిగేంత వరకు పార్టీ తరఫున పోరాడుతామన్నారు.

ఆదర్శంగా నిలిచారు..


డీఎంను అభినందిస్తున్న దృశ్యం

పాలకొండ రూరల్: పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సుదీర్ఘకాలం సేవలందించిన పట్నాల వెంకటేశ్వరరావు ఉద్యోగుల విధి నిర్వహణకు మార్గదర్శకంగా నిలిచారని వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కొనియాడారు. డీఎంకు మన్యం జిల్లా ప్రజా రవాణా అధికారిగా పదోన్నతి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎంఆర్ మూర్తి, జోనల్ కార్యదర్శి బొడ్డేపల్లి శ్రీనివాసరావు తదితరులు మంగళవారం డీఎంను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఉన్నతాధికారిగా జిల్లా కేంద్రం నుంచి ప్రజలకు మెరుగైన సేవలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి డీజే బాబు, వసంత్, జోషఫ్, చలం, చిరంజీవి తదితరులున్నారు.

7న ఎంఆర్‌పీఎస్ విజయోత్సవం

భామిని: మండల కేంద్రంలో జూలై 7న ఎంఆర్‌పీఎస్ విజయోత్సవాలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బోసు మన్మధరావు పిలుపునిచ్చారు. విజయోత్సవాలకు సంబంధించి సన్నాహాక సమావేశం మంగళవారం నిర్వహించారు.

ఎంఆర్‌పీఎస్ నాయకులు లోపింటి రాజేష్, ఎల్.చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సొంత మండలానికి బదిలీ చేయాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): తమకు సొంత మండలాల్లోనే బదిలీలకు అవకాశం కల్పించాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. ఇదే విషయమై మండలంలోని 20 గ్రామ సచివాలయాల ఉద్యోగులంతా మండల కేంద్రంలోని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు సొంత మండలాలకు బదిలీ చేయడంతో పాటు రేషనలైజేషన్‌లో మిగులు సిబ్బందిని ఏ విధంగా వినియోగించుకుంటారోనన్న దానిపై వివరాలు తెలియజేయాలన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీడీవో తెలిపారు.

తప్పిన పెనుప్రమాదం



కొమరాడ మండలం, గుమడ సమీపంలోని అంతర్ రాష్ట్ర రహదారిపై మంగళవారం పెద్ద ప్రమాదం తప్పింది. ఆ దారిలో వస్తున్న ఒడిశాకు చెందిన బొలెరో అక్కడి రెండు విద్యుత్ స్తంభాలను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆ స్తంభాలు విరిగిపడిపోగా వాహనం నుజ్జునుజ్జయింది. అదృష్టవశాత్తు డ్రైవరు చిన్నపాటి గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ దృశ్యం చూసిన వారంతా ఎంత వేగంగా వెళ్తే ఆ స్తంభాలు విరిగిపోయి ఉంటాయని అంటున్నారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేదని, ఒకవేళ కరెంట్ సరఫరా ఉంటే ఎంత ఘోరం జరిగేదోనని అనుకుంటున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

–కొమరాడ

శిథిలావస్థలో సచివాలయ భవనం



శిథిలావస్థలో జియ్యమ్మవలస మండలం, డంగభద్ర గ్రామ సచివాలయం ఉంది. ప్రస్తుతం సచివాలయం నడుపుతున్న భవనం పూర్తిగా పాడైంది. మెట్లపై పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు ఏ చిన్నపాటి వర్షం పడినా శ్లాబు కారిపోతోంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో సిబ్బంది బిక్కుబిక్కుమని విధులు నిర్వర్తిస్తున్నారు. అద్దె భవనంలో దీనిని నిర్వహిస్తుండగా, అద్దె ఇచ్చి మరీ ప్రమాదకర భవనం ఎంచుకోవడమేంటని పలువురు మండిపడుతున్నారు.

–జియ్యమ్మవలస రూరల్

ముర్రాటలతో మహిళలు



భామిని మండల కేంద్రంలో మంగళవారం రైతు కుటుంబాలు విత్తన వారాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ముర్రాటలతో గ్రామ శివారులోని గ్రామ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు.

– భామిని